## క్లుప్తంగా

### గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు సూచనలిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తపల్లి:గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రధానమంత్రి మాతృత్వ యోజనలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గర్భిణులు ప్రభుత్వాస్పత్రులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని తెలియపరిచారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### కార్మిక హక్కుల కోసం పోరాటం



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

పెద్దాపురం: కార్మికుల హక్కుల కోసం పోరాడడమే డిమాండ్స్ డే ప్రధాన లక్ష్యమని సీఐటీయూ నాయకులు డి.క్రాంతికుమార్ అన్నారు. కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పెద్దాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తోందన్నారు. లేబర్ కోడ్‌లు అమలు చేయడానికి ప్రయత్నిస్తుందని, దీనికి వ్యతిరేకంగా కార్మికులు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గడిగట్ల సత్తిబాబు, సిరిపురపు శ్రీనివాస్, దాడి బేబీ, తులసీ, స్నేహలత, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

### మరిడమ్మకు మఖ నక్షత్ర పూజలు



పూజలందుకుంటున్న మరిడమ్మ తల్లి

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ తల్లికి బుధవారం ఆషాఢమాసంలో మఖ నక్షత్ర ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### డ్రైన్ల అభివృద్ధి పనుల పరిశీలన

సామర్లకోట: మున్సిపాలిటీ నిధులతో స్థానిక 18వ వార్డు చిన్నవీధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ వైస్‌చైర్మన్ గోకిన సునేత్రదేవి బుధవారం పరిశీలించారు. వార్డులో డ్రైను పనులకు కౌన్సిల్ ఆమోదం లభించింది. దాంతో కాంట్రాక్టరు పనులు ప్రారంభించారు. ఈ మేరకు డ్రైన్ పనులను ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

### పాఠశాలల్లో ఎంఈఓ తనిఖీ



విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న ఎంఈఓ-2 పుల్లయ్య

సామర్లకోట: మండల పరిధిలో వీకే రాయపురం, సత్యవరపుపేట, కొత్తూరు, బోయనపూడి గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను బుధవారం మండల విద్యాశాఖాధికారి-2 పి.పుల్లయ్య పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల మౌలిక వసతులను పరిశీలించి, మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు వడ్డించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలను హోమ్ వర్కులను పరిశీలించారు. విద్యార్థులకు బ్యాగ్‌లు, యూనిఫారం రావలసి ఉన్నదని, అవి వచ్చిన తరువాత బూట్లు, బెల్టులతో కలిపి అందజేస్తామన్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శ్రీనివాసకుమార్, నారాయణ, రమణమ్మ పాల్గొన్నారు.

### ప్రమాదకర కర్మాగారాల తనిఖీ

కాకినాడ రూరల్: వాకలపూడి గ్రామంలో ప్రమాదకర కర్మాగారాలు, ప్రమాదకర పదార్థాలు నిల్వ ఉంచే స్టోరేజ్ ట్యాంకులను అధికారులు బుధవారం తనిఖీ చేశారు. జిల్లా కలెక్టరు షాన్ మోహన్ సగిలి ఆదేశాల మేరకు ఈ తనిఖీ చేపట్టామని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ తెలిపారు. వాకలపూడి గ్రామంలో పోర్ట్ రోడ్డులో ఉన్న మహతి స్టోరేజ్ టెర్మినల్‌ను పరిశీలించారు. ప్రమాదకర పదార్థాలను నిల్వ చేస్తున్న స్టోరేజ్ ట్యాంకులు వద్ద సెన్సర్ ఏర్పాటు, ఆపరేషన్ పద్ధతులు, ప్రమాదం వాటిల్లితే మంటలు ఆర్పేందుకు ఫోమ్ వ్యవస్థ గురించి ఆయనతో పాటు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మురళీకృష్ణ సిబ్బందికి అవగాహన కల్పించారు.

# మైకాసుర వధకు ముందడుగేద్దాం

- తూతూ మంత్రంగా పాలిథిన్ నిషేధం
- అధికారుల చర్యలు దాదాపు శూన్యం
- నెత్తిన పెట్టుకున్న ప్రజలే త్యజించాలి

పెద్దాపురం: మానవాళి ఆదరణ పొంది.. ఆ తరువాత ఆ జాతినే అథఃపాతాళానికి తొక్కేసేంతలా ఎదిగిపోయిన నిత్యావసర వస్తువు పాలిథిన్ కవర్. కాబట్టి వాటిని ఆదరించిన మనమే వాటిని వినియోగించకుండా ఉంటే ఆదరణ లేని ఏ వస్తువైనా మనలేదని తెలుసుకుని ఉత్పత్తిదారులు ఆ సంచుల తయారీని ఎప్పటికో అప్పటికి ఆపేస్తారు. తక్కువ మైక్రాన్ల సంచులు పర్యావరణానికి హాని కలిగిస్తాయని, వాటిని నిషేధించాలని దాదాపు అన్ని దేశాలు పాలిథిన్ వినియోగంపై సమరం ప్రకటించాయి. కానీ అమలులో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోతున్నాయి. మన దేశంలో అందునా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధం శూన్యమనే చెప్పాలి. ఎవరికి వారు యథేచ్ఛగా వినియోగిస్తున్నా నిషేధాన్ని అమలు చేయాల్సిన అధికారులు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు.

వినియోగించి పారేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు భూములో కలవడానికి వందల ఏళ్లు పడుతుంది. అంతవరకు ఈ వ్యర్థాలు భూ పై పొరల్లో పేరుకుపోయి భూ వాతావరణాన్ని వేడెక్కిస్తూ, వర్షాకాలాల్లో కురిసే వాన నీటిని భూమిలోనికి ఇంకనీయకుండా అడ్డుకుని మానవాళికి తీవ్రమైన చేటుచేస్తున్నాయి.

**క్యాన్సర్ కారకం..**

పాలిథీన్ వస్తువుల్లో విక్రయించే ఆహారాన్ని తీసుకోవడం వల్ల ప్లాస్టిక్‌లోని రసాయనాలు అవశేషాలు మనం లోనికి తీసుకునే ఆహారంతో లోపలికి వెళ్లి క్యాన్సర్ కారకంగా తయారవుతున్నాయి. ఇరవై మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉండే పాలిథిన్ కవర్లను వినియోగిస్తే క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటి నియంత్రణకు చేసిన చట్టాలను పటిష్టంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



### ప్రజలను చైతన్యవంతం చేయాలి..



పాలిథిన్ కవర్ల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉంది. వీటి నియంత్రణకు ప్రభుత్వం చేసిన చట్టాలను అధికారులు క్షేత్రస్థాయిలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– వట్టికూటి రాజుకుమార్, దివిలి, పెద్దాపురం మండలం

### ఆరోగ్య సమస్యలు వస్తాయి



పాలిథిన్ సంచుల వినియోగం వల్ల వాటిలోని ప్రమాదకరమైన రసాయనాలు ప్రజలకు ఆరోగ్యపరమైన సమస్యలు తీసుకువచ్చే అవకాశం ఉంది. వీటి వినియోగంపైన ప్రజలు ఎవరికివారే చైతన్యం కావాలి.

– డాక్టర్ జగదాంబ, ఏరియా ఆసుపత్రి వైద్యులు, పెద్దాపురం

### రాక్ కార్మికులకు కార్మిక సంఘాల మద్దతు



రాక్ సిరామిక్స్‌లో తొలగించిన కార్మికులకు మద్దతుగా ధర్నా చేసిన వివిధ కార్మిక సంఘాల నాయకులు

సామర్లకోట: స్థానిక రాక్ సిరామిక్స్‌లో పని చేసిన కార్మికులను తొలగించినందుకు నిరసనగా చేస్తున్న ఆందోళనకు బుధవారం వివిధ కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి. సుమారు 86 రోజులుగా కార్మికులు ఆకలితో అలమటిస్తూ ఉంటే ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించక పోవడం విడ్డూరంగా ఉన్నదని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు దాడి బేబి, సీఐటీయూ కార్యదర్శి సరేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 12వ తేదీ లోగా సమస్యలు పరిష్కారం కాకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని సీఐటీయూ కార్యదర్శి హెచ్చరించారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకుని వారికి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు ఎస్తేరు రాణి, తలారి నాగమణి, జాగారపు కుమారి, దేవి తదితరులు మద్దతు తెలిపినవారిలో ఉన్నారు.

# సమన్వయంతోనే అభివృద్ధి

- అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించుకోవాలి
- వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్
- మండల సర్వ సభ్య సమావేశం

కొత్తపల్లి: మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వైస్ ఎంపీపీలు చెట్టుబత్తిన సురేష్‌కుమార్, మదిరెడ్డి దొరబాబు అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికను తెలియజేశారు. పలు సమస్యలపై అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని, కొత్తపల్లి, నాగులపల్లి, కొమరగిరిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెల 9, 10 తేదీల్లో ప్రధాన మంత్రి మాతృత్వ యోజన కార్యక్రమం నిర్వహించారని కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎగ్జిక్యూటర్ కృష్ణ ప్రసాద్ తెలిపారు. నాగులపల్లి గ్రామం పూర్తిగా అభివృద్ధికి కుంటే పడిందని సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి భర్త నారాయణరెడ్డి అన్నారు. తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించాలంటే కుతుకుడుమిల్లి శివారు ఉన్న మద్దిల చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు కేటాయించాలని ఉన్నత స్థాయి అధికారులకు నివేదికను పంపించామన్నారు. కేటాయించేలా ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సంధ్య తెలిపారు. వైస్ ఎంపీపీ సురేష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. నిర్వహించే సమావేశాలకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, ఎంపీడీవో వెంకటనారాయణ, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సంధ్య

# హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ

- అందరూ విధిగా ధరించాల్సిందే
- డీఎస్పీ లతాకుమారి

పెద్దాపురం: వాహనచోదకుడు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రతి ఒక్కరికి ప్రాణ రక్షణ ఉంటుందని డీఎస్పీ లతాకుమారి అన్నారు. రవాణా శాఖ, పోలీస్, న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ భారీ స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దాపురం రవాణా శాఖాధికారి హరినాథరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతన్న రోడ్డు ప్రమాదాల్లో వాహనచోదకుల మృతుల్లో కేవలం హెల్మెట్ లేక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు చోటు చేసుకుంటున్నారు. విధిగా ప్రతి ఒక్క వాహనచోదకుడు హెల్మెట్ ధరించాల్సిందేనని ఆమె అన్నారు. రవాణా శాఖాధికారి హరినాథరెడ్డి, ఎస్ఐ వెలుగుల సురేష్ మాట్లాడుతూ యువతతో పాటు మైనర్ బాలలకు తల్లిదండ్రులు వాహనాలను అప్పగిస్తున్నారన్నారు,. అది ఏమాత్రం మంచిది కాదని, తమ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. వాహనచోదకుడితో పాటు బైక్‌పై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మట్ ధరించడం మంచిదన్నారు. అనంతరం బైక్ ర్యాలీని డీఎస్పీ లతాకుమారి జెండా ఊపి ప్రారంభించగా మున్సిపల్ సెంటర్, మెయిన్‌రోడ్డు, దర్గా సెంటర్, గుర్రాల సెంటర్ మీదుగా హెల్మెట్లు ధరించిన పోలీసులు, న్యాయవాదులు, వాహనచోదకులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖా. ఏఎంవీఐలు డి.శ్రీకాంత్‌బాబు, శ్వేతసాయి, సాయిబాబు, రవి, సిబ్బంది మానవ హక్కుల సంఘం నాయకులు నూతలపాటి అప్పలకొండ, లక్ష్మి, న్యాయవాదులు ప్రభూజీ, దుర్గాప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ లతాకుమారి

# అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



సామర్లకోట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



కొత్తపల్లి తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

సామర్లకోట: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. అఖిల భారత కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆందోళన నిర్వహించారు. గతంలో బీజేపీ ప్రభుత్వం అంగన్‌వాడీలకు వేతనాలు పెంచుతామని, ఐసీడీఎస్‌ను బలోపేతం చేస్తామని హామీలు ఇచ్చి నెరవేర్చలేదని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘ నాయకులు వడ్డి ఎస్తేరురాణి, వాణి, టి.నాగమణి తదితరులు ఆరోపించారు. కొత్త ప్రభుత్వం అంగన్‌వాడీల కోర్కెల దినోత్సవం సందర్భంగా 42 రోజుల సమ్మె కాలంలో ఇచ్చిన మినిట్స్ కాపీలోని అంశాలకు వెంటనే జీవో ఇవ్వాలని తదితర డిమాండ్లు చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వారి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ధర్నాకు సీపీఎం కార్యదర్శి కరణం ప్రసాదరావు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎ.సురేష్‌కుమార్‌లు మద్దతు ఇచ్చారు.

**పిఠాపురంలో..**

పిఠాపురం: దేశవ్యాప్త కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ ఆశవర్కర్లు బుధవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి టి.తులసి దేవి సత్యవతి సీఐటీయూ నాయకులు నందీశ్వరరావు మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి కార్మికులకు కుటుంబ అవసరాల నిమిత్తం రూ.26వేల వేతనం కల్పించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ చేయకూడదని, ఇటీవల చేసిన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరణ చేసి నిర్మాణ కార్మికులు ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వ పథకంలో పని చేస్తున్న స్కీం వర్కర్లు అందరినీ రెగ్యులర్ చేయాలని సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.చిన్న వి.వెంకటలక్ష్మి చిన్న సూర్యకాంతం జగదీశ్వరి, ఉమా, రమణమ్మ, చిన్నారి, వెంకటలక్ష్మి, వీరబాబు, తులసి తదితరులు పాల్గొన్నారు.



గొల్లప్రోలులో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

**కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా**

కొత్తపల్లి: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి జి.అప్పారెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులుగా పని చేస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. రూ.26వేలు కనీస వేతనం అందించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విరమించుకోవాలని దేశవ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్నామన్నారు.

# రహదారి నియమాలు పాటించాలి



సదస్సులో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి వాసంతి

పిఠాపురం: ప్రమాదాలు నివారించడానికి మోటారు వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని పిఠాపురం అదనపు జిల్లా జడ్జి ఏ వాసంతి తెలిపారు. బుధవారం కోర్టు ఆవరణలో మోటారు వెహికల్ యాక్టుపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మోటారుసైకిల్ పై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించాలన్నారు. కారులో తప్పని సరిగా ఎయిర్ బ్యాగ్స్ ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రభుత్వం కఠినమైన చట్టాలు అమలు చేస్తోందని చెప్పారు. సదస్సులో సబ్ జడ్జి ఎం.బాబు, జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.విజయ రామేశ్వరి, బార్ అధ్యక్షులు ఎం.రాజారావు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిబంధనలతో ప్రమాదాల నివారణ

**సీఐ లక్ష్మణరావు**

గండేపల్లి: రోడ్డు నిబంధనలు పాటించడం వల్లే ప్రమాదాలను నివారించవచ్చని జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో రోడ్ లైన్ సేఫ్టీపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. రుడ్డు ప్రయాణంలో హెల్మెట్ ధరించకపోవడం, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం, సెల్ ఫోన్లో మాట్లాడుతూ డ్రైవ్ చేయడంపై వచ్చే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదంతోపాటు శిక్షార్హనేరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్ బి.సూర్యనారాయణ మూర్తి, న్యాయవాదులు ఎ.ప్రభుజీ, ఎం.రాంబాబు, సత్యవతి, సోషల్ వర్కర్ ఎస్.అప్పలకొండ, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌టీవీఎస్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

### అదనపు కట్నం వేధింపులపై కేసు

జగ్గంపేట: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు జగ్గంపేట ఏఎస్ఐ సుబ్బారావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాజపూడి గ్రామానికి చెందిన శైలజకు పెద్దాపురం గ్రామానికి చెందిన పురందాసు రామకృష్ణతో 2019లో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పెళ్లి సమయంలో ఇవ్వాల్సిన అన్ని కానుకలు అత్తంటివారికి అందచేశారని, అయినా అదనంగా కట్నం కావాలంటూ భర్త రామకృష్ణ, అత్త, మామ, ఆడపడుచులు వేధించడంతో శైలజ కొద్ది రోజుల క్రితం పుట్టింటికి రాజపూడి వచ్చేసింది. అయినా వేధిస్తుండడంతో బుధవారం జగ్గంపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని ఏఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

### ఇన్‌చార్జి ఏపీఓగా కొండలరావు



కొండలరావు

కొత్తపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మండల ఇన్‌చార్జి ఏపీఓగా జి.కొండలరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గొల్లప్రోలు మండల ఏపీఓ విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పని చేసిన రాజబాబు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే ప్రభుత్వ పీఏగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి ఏపీఓగా కొండలరావు వచ్చారు. ఉపాధి కూలీలకు పని కల్పించి, వంద రోజుల పనిదినాలే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

### భోజనాలతో స్నేహభావం పెంపు



కొత్తూరు పాఠశాలలో విద్యార్థుల భోజనాలను పరిశీలించిన ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: విద్యార్థులు అందరూ ఒకేసారి వరుస క్రమంలో కూర్చుని భోజనాలు చేయడం వల్ల విద్యార్థులలో స్నేహబంధం బలపడుతుందని మండల విద్యాశాఖాధికారి వై.శివరామ కృష్ణయ్య అన్నారు.

మండల పరిధిలో కొత్తూరు గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ మేరకు ఉపాధ్యాయులకు పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి పలు సూచనలు ఇచ్చారు.

### మోటారు సైకిల్ చోరీ

జగ్గంపేట: రామవరం గ్రామానికి చెందిన లింగంశెట్టి లక్ష్మీనారాయణకు చెందిన పల్సర్ మోటారు సైకిల్ చోరీకి గురైంది. జగ్గంపేట ఏఎస్సై ముజుబుద్దీన్ కథనం ప్రకారం..లక్ష్మీనారాయణ రామవరం శివారులో తన పొలం వద్ద రోడ్డుపై గత నెల 29వ తేదని మోటారుసైకిల్ పార్కు చేసి పొలంలోకి వెళ్లాడు. కొద్దిసేపటికి వచ్చి చూడగా మోటారుసైకిల్ కనిపించ లేదు. దీనితో అప్పటి నుంచి పలు చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

### గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దుర్గారాణి

గండేపల్లి: తాళ్లూరు జెడ్పీ స్కూల్‌లో బుధవారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి అధ్యక్షతన గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బేటి బచావో, బేటి పడావో, బాలల హక్కులు, అక్రమ రవాణా, వేధింపులు, పీసీపీఎన్డీటీ యాక్ట్ తదితర అంశాలపై వివరించారు. బాలికలు 18, బాలురు 21 ఏళ్లు నిండకుండా వివాహాలు చేసుకుంటే చట్టరిత్యా నేరమని, రెండేళ్ల జైలు శిక్ష గాని, లక్ష రూపాయిలు జరిమానా గాని ఉంటుందని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగపార్వతి, హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

శంఖవరం: పరిసరాల పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. కత్తిపూడిలో పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్త, వ్యర్థాను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీత తీయించారు. గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచకారీ చేయించారు. వాటర్ ట్యాంక్‌లు శుభ్రం చేయించారు.

# డయేరియా నివారణ అందరి బాధ్యత

కోటనందూరు: డయేరియా నివారణకు అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ జయ మాధవి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శిలను స్టాప్ డయేరియా, ఇంటిపన్నులు, నాడు-నేడు పనుల పురోగతిపై సమీక్షించారు. ఎంపీడీఓ మాధవి మాట్లాడుతూ కుళాయిలకు సరఫరా చేసే తాగునీటిని రెండు పూటలా క్లోరినేషన్ చేయాలని, నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పైపులైన్ రిపేర్లు చేయాలన్నారు. తరచూ ఎబెట్ ద్రావణాన్ని పిచికారీ, ఫాగింగ్ చేయించాలని చెప్పారు. అనంతరం 17 పంచాయతీలకు వచ్చిన నీటి పరీక్ష యంత్రాలు క్లోరోస్కోపులను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.



పంచాయతీ కార్యదర్శులకు క్లోరోస్కోపులను అందిస్తున్న ఎంపీడీఓ, ఈఓ పీఆర్డీ